క్లుప్తంగా

నాణ్యమైనది భారతి సిమెంట్



ప్రసంగిస్తున్న ఇంజినీర్ కిరణ్‌కుమార్

మద్దికెర: అత్యాధునిక ప్రమాణాలతో నాణ్యమైన నిర్మాణాలకు పెట్టింది పేరు భారతి సిమెంట్ అని కంపెనీ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో భారతి సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతి సిమెంట్ 2023 సంవత్సరంలో నాణ్యతలో ఆసియాలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అల్ట్రాఫాస్ట్ పవర్ కలిగి ఉందన్నారు. ఎలాంటి నిర్మాణానికైనా భారతి సిమెంట్ వినియోగించవచ్చని సూచించారు. అనంతరం మేస్త్రీలకు బహుమతులు అందజేశారు. సేల్స్‌మన్ ఇక్బాల్, కుమ్మరి రామచంద్ర, రంగస్వామి పాల్గొన్నారు.

పేద మహిళకు కంటి వెలుగు



ఆపరేషన్ అనంతరం వైద్యులతో సుధ

ఎమ్మిగనూరు: పేదరికంతో ఇబ్బందిపడుతూ కంటిచూపు కోల్పోయిన మహిళకు కంటి వెలుగులందించారు బ్రాహ్మణ సంఘం పెద్దలు. బ్రాహ్మణ సమాజానికి చెందిన సుధ కంటి చూపు కోల్పోయి ఇబ్బంది పడుతోంది. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రఘునందన్ స్వామి, కృష్ణస్వామి స్పందించి స్థానిక ఆర్‌కే వైద్యశాలలో చేర్పించారు. అక్కడి వైద్యులు హేమంత్ కుమార్ సుధకు ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహించారు. తనకు కంటిచూపు ప్రసాదించిన బ్రాహ్మణసంఘంకు, వైద్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆస్పరి: మండల పరిషత్ కార్యాయలంలో శుక్రవారం ఎంపీపీ సుంకుర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ గురువారం తెలిపారు. సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్యం, రోడ్లు భవనాలు, తాగునీరు, స్త్రీ సంక్షేమ శాఖపై సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

పత్తిలో ఎర్ర తెగులు

మద్దికెర: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి పంటను ఎర్రతెగులు ఆశిస్తుందని రైతులు వెంటనే యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను రక్షించుకోవాలని ఏఓ రవి సూచించారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. సరైన విత్తనాలు ఎంచుకోకపోవడం, వాతావరణంలో మార్పులు, పోషకాల లభ్యతలో సమతుల్యత లేకపోవడం, తేమ తొందరగా ఆరిపోవడం, కాయ ఏర్పడే దశలో వాతావరణ మార్పులు, ఎక్కువ రోజులు బెట్టకు గురవడం వల్ల ఎర్రతెగులు ఆశించిందని చెప్పారు. రైతులు యజమాన్య పద్ధతులు పాటించి భూమిలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. ఎర్ర తెగులు నివారణకు ఎకరాకు కిలో మెగ్నీషియం సల్ఫేట్, కిలో 13-0-45, 500 గ్రాములు మాక్స్ లేదా ఎఫ్-4ను వారం వ్యవధిలో రెండు లేక మూడు సార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న సీపీఐ దీక్షలు



నిరాహార దీక్ష చేపట్టిన సీపీఐ నాయకులు

ఆస్పరి: వేదావతి ప్రాజెక్టు నీటిని ఆస్పరి మండలానికి సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ చేపట్టిన నిరాహార దీక్షలు గురువారం రెండవ రోజుకు చేరాయి. నాయకులు ఆంజనేయులు, బడేసాహెబ్, రంగన్న, రామాంజనేయులు వెంకటేష్ తదితరులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడుతూ.. ఆస్పరి మండలంలో రైతులు వర్షాధారంపై పంటలు సాగుచేస్తూ నష్టాలు చవిచూస్తున్నారన్నారు. మండలానికి వేదావతి ప్రాజెక్టు ద్వారా తాగు, సాగు నీరు అందిస్తే రైతాంగం బాగుపడుతుందన్నారు. సీపీఐ నాయకులు కృష్ణమూర్తి, హనుమంతు, నాగేష్ పాల్గొన్నారు. దీక్షలకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు.

సచివాలయ సేవలు విస్తృతం చేయండి

కృష్ణగిరి: అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అందించే సర్వీసులను సకాలంలో అందించాలని తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ విశ్వమోహన్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వారు డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రజలు తమ అవసరం నిమిత్తం సచివాలయాలకు వచ్చినప్పుడు వారి పట్ల హుందాగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పొలాలకు సంబంధించి మ్యూటేషన్ కట్టేటప్పుడు ఆయా గ్రామాల వీఆర్వోలు సర్టిపై చేస్తేనే అప్లయ్ చేయాలని సూచించారు. ప్రతి రోజు కనీసం 15 నుంచి 20 సర్వీసులు చేయాలన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి
- రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల పంపిణీ



ఎమ్మిగనూరులో డ్రిప్ పరికరాల లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సబ్సిడీ విత్తనాల పంపిణీ నుంచి పంటలు సాగు చేసి దిగుబడులు అమ్ముకునే వరకు రైతులకు ప్రతి దశలో అండగా ఉండి వారి అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గంలోని గోనెగండ్ల, ఎమ్మిగనూరు, కంబదహాల్ రైతులకు రూ.12,20,879లతో మంజూరైన డ్రిప్, స్ప్రింక్లర్లను ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, ఎంపీపీ కేశన్న, హార్టికల్చర్ ఏపీడీ రాజకృష్ణారెడ్డిలతో కలిసి పంపిణీ చేశారు. ఆయా పరికరాలతో వచ్చిన లారీలను జెండా ఊపి ప్రారంభించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో 8.88 హెక్టార్లలో పలు పంటలు సాగు చేసే 11 మంది రైతులకు రైతులకు 90 శాతం సబ్సిడీపై ఆయా పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వీటిని రైతు లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీడీ మాట్లాడుతూ..2023-24 సంవత్సరానికి గాను 5 వేల హెక్టార్లలో ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్, స్ప్రింకర్ల యూనిట్లను సబ్సిడీపై అందించేలా లక్ష్యం విధించినట్లు తెలిపారు. ఏపీ సూక్ష్మ సాగు నీటి పథకం ద్వారా ఐదెకరాల్లోపు పొలం ఉన్న రైతులకు 90 శాతం రాయితీపై, ఐదు ఎకరాల పైబడిన వారికి 70 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా స్ప్రింక్లర్ యూనిట్లను ఐదు ఎకరాల్లోపు వున్న రైతులకు 50 శాతం, 5 ఎకరాలకుపైబడి ఉన్న వారికి 45 శాతం రాయితీతో ఇస్తారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 10530 మంది రైతులు ఆయా పరికరాల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. నీటి వృథాను అరికట్టి పంటలకు అవసరం మేరకు ఉపయోగించుకొనేందుకు డ్రిప్ విధానం పనిచేస్తుందన్నారు. ఏఓ మహేశ్వర్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారిణి శ్రీవాణి, ఎంఐడీసీ జయరాంరెడ్డి, ఎంపీఈఓ జగదీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, సిగ్నెట్, నెటాఫిం కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అర్థవంతంగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ హేమలత సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏఓ హేమలత మాట్లాడుతూ.. ఆర్బీకే సిబ్బంది పొలాల వద్దకే వచ్చి పంట నమోదు చేస్తారన్నారు. అలాగే ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన తీసుకోవాలన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సమగ్ర భూసర్వే ప్రారంభించిందని, మండలంలో 12 గ్రామాల్లో సర్వే పనులు పూర్తయ్యాయని చెప్పారు. మరో 8 గ్రామాల్లో సర్వే జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే సమగ్ర ఓటరు సర్వే జరుగుతోందని బీఎల్ఓలకు అందరూ సహకరించాలన్నారు. ఎంఈఓ రామాంజనేయులు మాట్లాడుతూ బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ సూచించారు. ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ వేలం వాయిదా

ఆస్పరి: మండలంలోని తంగరడోణ కూరగాయల మార్కెట్ నిర్వహణ హక్కుల వేలం వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న తెలిపారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో సర్పంచ్ శంకరమ్మ, పత్తికొండ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో వేలం వేయగా పాటదారులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో ఈనెల 17వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు. ఆసక్తి గల వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కృష్ణగిరి: కృష్ణగిరి గ్రామ శివారులోని కొత్తపల్లె క్రాస్ రోడ్డు వద్ద గురువారం అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. దాడిలో మన్నెకుంటకు చెందిన బోయ పరుశరాముడు, కృష్ణగిరికి చెందిన బోయ మహేష్‌బాబు, చిన్నరాముడు నుంచి 90 ఎంఎల్ పరిమాణం గల 192 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను, ఏపీ 21 సీజే 5442 టీవీఎస్ బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చిరుధాన్యాల విత్తన కిట్ల పంపిణీ



ఎస్సీ రైతులకు విత్తన కిట్లు అందిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

వెల్దుర్తి: జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం (జెడ్‌బీఎన్‌ఎఫ్) కింద ఎస్సీ రైతులకు గురువారం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 14 రకాల చిరుధాన్యాల విత్తనాలతో కూడిన కిట్లను అందించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎస్సీ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఆలీబాషు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావ్ చేతుల మీదుగా మండలంలోని 136 మందికి కిట్ల పంపిణీ జరిగింది. అధికారులు మాట్లాడుతూ.. విత్తనాలను సరైన పద్ధతిలో నాటుకోవాలని, జీవామృతం, బీజామృతంలను ఎరువులుగా వాడుతూ, మల్చింగ్ తదితర ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయం లాభదాయకం చేసుకోవాలన్నారు. రూ.10 వేల విలువ చేసే కిట్టులో భాగంగా పనిముట్లు రానున్నాయన్నారు. ఖర్చు లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నేల సారం పెంచడంతోపాటు రైతులకు నాణ్యమైన దిగుబడులతో ఆర్థిక బలత్వం చేకూర్చడమే లక్ష్యమన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రతినిధి మాబువలి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వెంకటాపురం రోడ్డుకు ఇరువైపులా ఆ ప్రాంత వాసులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, ఖాళీ స్థలాలలో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం స్థానిక బాలికల హైస్కూల్ ఆవరణలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. హాలహర్వి వైద్యాధికారిణి పరిమళ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



ఎమ్మిగనూరులో విద్యార్థులకు సూచనలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పోషకాలతో కలిగి ఉండేలా ఫోర్టిఫైడ్ బియ్యం కలిపి అందిస్తున్నారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణంలోని రేషన్‌షాపులు, వెంకటాపురం పాఠశాలతో పాటు సంజీవనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం, సోగనూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూళ్లలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం రుచి, నాణ్యతపై విద్యార్థుల వద్ద ఆరాతీశారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తుండడంపై హెచ్‌ఎం పీఎండీ రఫీక్‌ను అభినందించారు. రెవెన్యూ, విద్యా శాఖ, ఐసీడీఎస్ అధికారులు ఉన్నారు.

సమగ్ర సర్వేకు రైతులు సహకరించాలి



నాగలదిన్నెలో గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానందరాజు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ హక్కు- భూ రక్ష రీసర్వేకు రైతులు సహకారించాలి తహసీల్దార్ నిత్యానందరాజు కోరారు. గురువారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో సమగ్ర సర్వేపై గ్రామస్తులతో రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల భూములను ఉచితంగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తుందన్నారు. సర్వే పూర్తయితే గ్రామంలో భూ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని పేర్కొన్నారు. రీ సర్వేకు రైతులు, గ్రామస్తులు సహకారించాలని కోరారు. అలాగే రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే పకడ్బందీగా చేపట్టాలని సర్వేయర్లకు సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఆర్ఐ జెర్మియా, సర్వేయర్ అబ్బర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో చిచ్చు పెట్టేందుకు టీడీపీ కుట్రలు



మాట్లాడుతున్న ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ

చిప్పగిరి: ప్రశాంతంగా ఉన్న చిప్పగిరి మండంలోని పల్లెల్లో అల్లర్లు, గొడవలు సృష్టించడానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ ప్రయత్నిస్తోందని ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ ఆరోపించారు. ఆయన గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ.. వార్డు మెంబర్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని కుందనగుర్తి, ఏరూరు గ్రామాలలో తమ పార్టీ మద్దతుదారులు నామినేషన్ దాఖలు చేశారన్నారు. ఎన్నికల దృష్ట్యా తమ అభ్యర్థులతో మాట్లాడేందుకు కుందనగుర్తికి వెళ్లగా గ్రామంలోకి రాకుండా కొందరు టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారన్నారు. గొడవలు పడటం ఇష్టం లేక వెనుదిరిగి వచ్చామని స్పష్టం చేశారు. ఈ తతంగమంతా కోట్ల సుజాతమ్మ తమ కార్యకర్తల ద్వారా నడిపిస్తుందని ఆరోపించారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను ఇలా గొడవలకు ఉసిగొల్పడం తగదన్నారు. మండల కన్వీనర్ రంగస్వామి, నాయకులు రాజన్న శేఖన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో అన్ని వర్గాలకు సముచిత స్థానం



సహకార సంఘం అధ్యక్షుడి ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం చేకూరుతుందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గోనెగండ్లలోని బాష ఫంక్షన్ హాలులో సహకార సంఘం అధ్యక్షుడిగా గంజిహళ్లి తిరుమల రెడ్డి ప్రమాణ స్వీకర కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి హాజరై మాట్లాడారు. ముందుగా గోనెగండ్లలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే, ఎర్రకోట జగన్‌ను గజమాలతో సన్మానించారు. సహకార సంఘం అధ్యక్షుడిగా తిరుమల రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం వారు మాట్లాడుతూ.. గోనెగండ్ల సహకార సంఘాన్ని అభివృద్ధి బాటాలో నడిపించాలన్నారు. రైతు సంక్షేమానికి వైఎస్సార్ కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. పులికనుమ ప్రాజెక్టు వైఎస్ చలువే అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక జీడీపీ ఆనకట్ట పెంపునకు రూ.57 కోట్లు మంజూరు చేశారని వివరించారు. జలజీవన్ మిషన్ కింద మండలంలో 14 గ్రామాలకు రూ.25 కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధుల్లో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేస్తామని చెప్పారు. గోనెగండ్ల మండలంలో ఎర్రకోట నుంచి పెద్దమరివీడు మీదుగా పెద్ద నేలటూర్ వరకు, గంజిహళ్లి నుంచి నాగలాపురం మీదుగా ఎమ్మిగనూరు వరకు రోడ్డు వేయడం జరిగిందన్నారు. వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌బీ మన్సూర్, బందెనవాజ్, భాస్కర్ రెడ్డి, దొరబాబు, దయకర్ రెడ్డి, గోవింద్, ధర్మకారి నాగేశ్వర రావు, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి చూపాలి



మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిత్యం పురోగతి సాధించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మండల అధికారులకు సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో గురువారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. పలువురు నాయకులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. అనంతరం మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా 35 గ్రామాలలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఆయా నిధులతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. పనితీరు బాగలేని అధికారులు ఇప్పటికైనా తీరు మార్చుకుంటే మంచిదని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు. హాజరుకాకపోతే వేటు తప్పదని హెచ్చరించారు.

ఆర్డీఎస్ నిర్మాణం పూర్తిచేయాలి

గోనెగండ్ల: దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్డీఎస్ కూడి కాలువ నిర్మాణాన్ని పూర్తిచేసి సాగునీరు అందించి మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలలో వలసలు నివారించాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్,రంగన్న, మండల కార్యదర్శి నాగప్పలు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ధర్నా నిర్వహించి తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రంఅందజేశారు.

అధ్వానంగా ఐనకల్లు రోడ్డు



ఆస్పరి: మండలంలోని ఐనకల్లు నుంచి అటికెలగుండు గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు అధ్వానంగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఐనకల్లు నుంచి 3 కిలోమీటర్లు దూరంలో ఉన్న అటికెలగుండు గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు గుంతలు పడి ఎద్దుల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో రైతులు పండించిన కూరగాయలను ఆస్పరి, బిల్లేకల్లు మార్కెట్లకు తరలించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా ఏళ్ల నుంచి రోడ్డు సమస్య పరిష్కరించాలని అధికారులను విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.

మొక్కలే జీవనాధారం

హాలహర్వి: ప్రతిఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి, ఏపీఓ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో మేరీ మిట్టి-మేరే దేశ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. వారు మాట్లాడుతూ దేశాన్ని, నేలను, ప్రకృతిని ప్రతిఒక్కరూ ప్రేమించాలన్నారు. భావితరాలకు మొక్కలే జీవనాధారంగా నిలుస్తాయన్నారు. ఎంపీటీసీ గంగమ్మ, ఉపాధి హామీ కోర్సు డైరెక్టర్ సురేష్‌కుమార్, వాటర్‌షెడ్ టెక్నికల్ అసిస్టెంట్ గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

'వేదావతి' వేగవంతం చేయాలి

హొళగుంద: బిలేహాళ్ వద్ద నిర్మిస్తున్న వేదావతి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని, ప్రాజెక్ట్ కోసం భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి పెద్యాట మారెప్ప డిమాండ్ చేశారు. హొళగుంద బస్టాండులో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక నిరహారదీక్ష గురువారం రెండో రోజుకు చేరుకుంది. మారెప్ప మాట్లాడుతూ ప్రాజెక్ట్‌ను 8 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించి, ప్రాజెక్ట్ పరిధిలో ఆస్పరి మండలాన్ని చేర్చాలని 253 గ్రామాలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన నామినేషన్ల పర్వం



ఎల్.నగరంలో ఆర్ఓకు నామినేషన్ పత్రాలను అందిస్తున్న అభ్యర్థి నక్క లోకేశ్



దేవనకొండలో అభ్యర్థి వెంకటలక్ష్మితో మద్దతుదారులు

వెల్దుర్తి: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె, ఎల్.నగరం, కృష్ణాపురం, కలుగొట్ల గ్రామ పంచాయతీల పరిధిలో ఖాళీగా ఉన్న 4 వార్డు మెంబర్ స్థానాలకు గురువారం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆయా స్థానాలకు 6 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి/ఎంపీడీఓ శ్రీనివాసరావ్ తెలిపారు. బొమ్మిరెడ్డిపల్లె 3వ వార్డు స్థానానికి అభ్యర్థులు తలారి బోయ ఎల్లమ్మ, కోదండపాణి నామినేషన్లు వేశారు. ఎల్.నగరం పంచాయతీ పరిధిలోని పిక్కిలివాని పల్లె వార్డు నంబరు 2 స్థానానికి అభ్యర్థులు నక్క లోకేశ్, శ్రీనివాసనాయక్ నామినేషన్లు వేశారు. స్క్రూటినీ అనంతరం ఇక్కడ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. కృష్ణాపురం పంచాయతీ సిద్ధినగట్టు వార్డు నంబరు 10 స్థానానికి అభ్యర్థి మాదాసు మహేశ్, కలుగొట్ల 11వ వార్డు మెంబర్ స్థానానికి అభ్యర్థి గాలమ్మ మాత్రమే నామినేషన్ వేయండంతో ఆయా స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి.

నామినేషన్ల స్వీకరణ పూర్తి కావడంతో 11వ తేదీ నామినేషన్ల పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న ఉపసంహరణకు అవకాశం ఉందని ఎంపీడీఓ తెలిపారు. పోటీ జరిగే ప్రాంతాలలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, 15, 16, 17 తేదీలలో కేటాయించిన గుర్తులతో అభ్యర్థులు ప్రచారం నిర్వహించుకోవచ్చన్నారు. 19న ఎన్నికలు, అదే రోజు ఫలితాల వెల్లడి ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు.

హొళగుంద: మండలంలో ఖాళీగా ఉన్న 3 వార్డు స్థానాలకు గురువారం ఆఖరి రోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. సుళువాయి 7వ వార్డు స్థానానికి 4, చిన్నహ్యాట 9వ వార్డుకు రెండు, మడ్డిలింగదహళ్లి 3వ వార్డుకు 4 నామినేషన్లు దాఖలైనట్లు జిలాల్ సహాయక ఎలక్షన్ అథారిటీ (ఏడీఈఏ), ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ విలేకరులకు తెలిపారు.

8వ వార్డు ఏకగ్రీవం

దేవనకొండ: మండలంలోని కుంకనూరులో 8వ వార్డు స్థానానికి ఒకే నామినేషన్ దాఖలు కావడంతో స్క్రూటినీ అనంతరం ఎన్నిక ఏకగ్రీవం కానుంది. గతంలో 8వ వార్డు మెంబర్‌గా గెలుపొందిన ఉప్పలపాడు నాగమ్మ అనారోగ్యంతో మరణించడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ మేరకు వెలువడిన ఎన్నికల నోటిఫికేషన్‌లో ఆ వార్డుకు గ్రామానికి చెందిన గిత్త వెంకటలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. ఎవరూ పోటీలో లేకపోవడంతో ఆమె ఏకగ్రీవ ఎన్నిక దాదాపు ఖరారైంది. ఈ సందర్భంగా గిత్త వెంకటలక్ష్మిని జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, నాయకులు మల్లికార్జునరెడ్డి, రామప్ప, గిత్త పరమేష్, గోసీ మల్లికార్జున తదితరులు అభినందించారు.



ఎమ్మిగనూరులో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న కమిషనర్



మద్దికెరలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి నగేష్



హొళగుందలో కేజీబీవీలో విద్యార్థినికి మాత్ర వేస్తున్న డాక్టర్ బింధుమాధవి

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఎమ్మిగనూరు: విద్యార్థులు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని మున్సిపల్ కమిషనర్ ఎస్ గంగిరెడ్డి పేర్కొన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ పాఠశాలలో 400 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అలాగే హ్యాండ్‌వాష్ డే నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ విజయకృష్ణ, వైద్య సిబ్బంది గిడ్డమ్మ, రాఘవేంద్ర, అయేషా తదితరులు పాల్గొన్నారు.

నందవరం: ఆల్బెండజోల్ మాత్ర వేసి పిల్లలో నులిపురుగులను నివారిద్దామని పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్యలత పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని హైస్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 1,472 మంది విద్యార్థులకుగానూ తొలిరోజు 1400 మందికి మాత్రలు వేశామన్నారు. మిగిలిన చిన్నారులకు నేడు(శుక్రవారం) పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సీహెచ్‌ఓ బలరాం, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అర మాత్ర, 3 నుంచి 19 ఏళ్ల పిల్లలకు 400 ఎంజీ టాబ్లెట్ వేసి నీరు తాగించాలని సూచించారు. సీహెచ్‌ఓ నిరంజన్, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్‌రావు, తదితరులు ఉన్నారు.

గోనెగండ్ల: మండలంలోని పాఠశాలల్లో వైద్య సిబ్బంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. గోనెగండ్ల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో డాక్టర్ రవళి, వైద్య సిబ్బంది మాత్రలు వేశారు. గురువారం మాత్రలు వేసుకొని వారికి 17వ తేదీన స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మాత్రలు అందిస్తామన్నారు.

కృష్ణగిరి: మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం వైద్యాధికారులు ప్రదీప్, వరప్రసాద్ తమ సిబ్బందితో కలిసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. మండలంలోని 54 పాఠశాలలు, 49 అంగన్‌వాడీ కేంద్రాలు, మూడు కాలేజీల్లో చదువుతున్న 1 - 19 ఏళ్లలోపు 12,712 మంది విద్యార్థులకుగాను 11,836 మందికి మాత్రలు వేశామన్నారు.

హొళగుంద: మండలంలోని కేజీబీవీ, జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ సెంటర్లలో పీహెచ్‌సీ డాక్టర్లు బింధుమాధవి, న్యూటన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజల్ మాత్రలను పంపిణీ చేశారు. సుపర్‌వైజర్ సుశీలమ్మ, ఏఎన్ఎంలు ఈరమ్మ, సుజాత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: నులిపురుగుల నివారణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి అన్నారు. ఆయన గురువారం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలు ఉన్న పిల్లలకు వైద్యుల సలహా తీసుకుని మాత్రలు మింగించాలని సూచించారు.